# కాంతులీనిన కళ్ళు

పాదాభివందనం చేస్తున్న శ్వేతను పైకి లేవనెత్తాడు సత్యం.

"అన్నయ్యా!" అంది ఆర్ద్రతగా.

చెల్లాయి కళ్ళల్లో కనీటిని చూసి చలించిపోయాడు సత్యం.

ఆ అశ్రుబిందువులలో అన్న పట్లఆప్యాయత, మెట్టినింటికి పయనమౌతున్నానన్న ఆనందం, అయినవాళ్ళందర్నీ విడిచిపోవలసి వస్తోందన్న బాధమిళితమై ఉన్నాయి.

శ్వేత బుగ్గల మీంచి జాలువారుతున్న కన్నీటి బిందువుల్నిమునివేళ్ళతో సుతారంగా తుడిచాడు సత్యం. ఈరోజు కోసమే అతడెన్నో రోజులబట్టి ఆత్రంగా ఎదురు చూస్తున్నాడు.

★ ★ ★

శ్వేత ఆ ఇంటి ఆడబడుచు. ఒక్కగానొక్క ఆడబిడ్డ. మంగపతికి ఆ పిల్లంటే ప్రాణం. తల్లిలేని బిడ్డ కావడంతో చిన్నప్పటి నుంచి ఆ పిల్లకు తల్లి, తండ్రి అన్నీ తానే అయి అల్లారు ముద్దుగా సాకాడు. కూతుర్ని క్షణం విడిచి ఉండలేడు. సత్యానికి, ఆ పిల్లకి మూడేళ్ళు తేడా. అయినా పెద్ద ఆరిందలా వాడు చెల్లాయినెత్తుకుని ఆడించేవాడు.

పేరుకు తగ్గట్టే శ్వేత మనసు కూడా ఎంతో స్వచ్ఛమైంది. కల్లాకపటం ఎరుగని ముగ్ధ. ఆమెకు తండ్రివద్ద ఎంత చనువుందో అంత వినయం ఉంది.

పదో తరగతి పాసైన శ్వేతను చదువు కోసం మరో ఊరు పంపడం ఇష్టంలేక ఆమెకు కాలేజీ చదువు చెప్పించలేదు మంగపతి.

కొడుకు సత్యం కూడా టెన్త్ వరకే చదివి తండ్రికి వ్యవసాయ పనుల్లో

సహాయపడేవాడు.

ఈడొచ్చిన పిల్లకి పెళ్ళి చేయాలన్న తలంపు ఉన్నా కూతురికి దూరంగా ఉండలేని కారణంగా మంగపతి ఎంతో కాలం శ్వేతకు సంబంధాలు చూడలేదు. ఆడపిల్లని ఏదో ఒకరోజు మెట్టినింటికి పంపక తప్పదు. కూతురి మీద ఎంత ప్రేమ ఉన్నా కడదాకా ఆ పిల్ల తనవద్దే ఉండాలనుకోవడం మూర్ఖత్వం అవుతుందే తప్ప ప్రేమ అనిపించుకోదు. మరి మంగపతి ఆ దిశగా ఎందుకాలోచించడో తెలీడంలేదు. అమ్మాయికి పెళ్లిచేసి అత్తవారింటికి పంపేబదులు ఇల్లరికపు అల్లుణ్ణి తెచ్చుకుంటే బావుండునన్న ఆలోచన వచ్చింది. అయితే అందుకు ఎవరూ ముందుకు రాకపోవడంతో శ్వేతని జనార్దన్‌కి ఇవ్వక తప్పింది కాదు. వంద ఎకరాల భూస్వామైన మంగపతి లక్షలకొద్ది కట్నం గుమ్మరించి ఎంతో వైభవంగా కూతురి పెళ్ళంటే చేశాడుగాని ఆ పిల్లను విడిచి ఉండలేక అనతికాలంలోనే బిడ్డను పుట్టినింటికి తీసుకొచ్చేశాడు. మావగారు మోతుబరి కావడం వల్ల ముద్దు ముచ్చట విషయంలో జనార్దన్‌కి ఏ లోటు జరగలేదు. కాకుంటే కూతుర్ని అల్లుడితో పంపడం విషయంలోనే అటు ఇటు ఊగిసలాడేవాడు ఫలితంగా జనార్దనే తరచు అత్తవారింటికి రాకపోకలు సాగించసాగాడు.

మంగపతి ఆ ఊరి సర్పంచి కావడం, బాగా పలుకుబడి ఉన్న వ్యక్తి అవడం వల్ల గ్రామస్థులెవ్వరూ అతని వ్యక్తిగత విషయాల్లో తలదూర్చే సాహసం చేసేవారు కాదు. అక్కడికి ఒక్కరిద్దరు పెద్ద మనుషులు మాత్రం శ్వేత కాపురానికి పంపకపోవడంపై ఆరా తీయకపోలేదు.

"కూతుర్ని విడిచి నేనుండలేనయ్యా. అది ఇక్కడి ఉండటం దాని మొగుడికి ఇష్టమే. మధ్యలో మీకొచ్చిన ఇబ్బందేమిటో నాకు బోధపడడం లేదు" అంటూ కస్సున లేచేవాడు. దాంతో వాళ్ళ నోళ్ళు మూతలు పడేవి.

శ్వేత పుట్టింట్లో ఉండే మనవణ్ణి కని తండ్రి చేతిలో పెట్టింది. ఇహ అతడి ఆనందానికి అంచుల్లేవు.

జనార్దన్ ఎంత సహనశీలుడైనా అప్పుడప్పుడు కాస్త అసహనానికి గురయ్యేవాడు. అయితే ఆ తండ్రికూతుళ్ళ అనుబంధం, తనను కన్న కొడుకు కంటెమిన్నగా చూసుకుంటున్న వైనం అతడి చేత ఏమాట అనిపించలేకపోయింది. కాకపోతే భార్యని తనతో వచ్చేయమని అప్పుడప్పుడు ఒత్తిడిచేస్తూ ఉండేవాడు తండ్రిని కాదనలేక పెనిమిటి మాట జవదాటలేక లోలోపల తల్లడిల్లిపోయేది శ్వేత.

ఇలా ఉండాగా సత్యానికి సంబంధాలు రావడంతో తను బతికుండగానే తనయుడి తలమీద కూడా రెండక్షింతలు వేసేసి బాధ్యత తీర్చుకోవాలనుకున్నాడు మంగపతి.

పెళ్ళైన చెల్లెలు పుట్టింట్లో ఉండాగా తను ఇల్లాల్ని తీసుకొస్తే పరిణామాలెలా ఉంటాయోనని భయపడిపోయాడు సత్యం. తన భార్య ఏమైనా అంటే ఆ మాటకు పుట్టింట్లో ఉన్న శ్వేత మనసు గాయపడితే తను తట్టుకోగలడా? మరో కోణంలో నుంచి సూస్తే తన వివాహం వల్ల ఆమెకు మేలు జరిగే అవకాశం కూడా లేకపోలేదు. వదినను చూసిన తర్వాత తండ్రి కూతుళ్ళ పాశాన్ని బలవంతంగా తెంచుకునేనా శ్వేత అత్తవారింటికి వెళుతుంది. తాత్కాలికంగా ఆ పిల్ల మనసును కష్టపెట్టినా ఆ తర్వాత దాని మానాన అది హాయిగా మొగుడితో కాపురం చేసుకుంటుందన్న సంతృప్తి ఉంటుంది. అయితే తండ్రి మనసు గాయపరచడం కూడ తనకిష్టంలేదు. ఒకవేళ తన ఊహకుభిన్నంగా కన్నతండ్రి తమనే వేరుకుంపటి పెట్టుకో మంటే?. . . అవసాన దశలోకి అడుగిడుతున్న నాన్నని విడిచిపెట్టి తను మాత్రం ఉండగలడా? రాబోయే ఇల్లాలికి నచ్చని పరిస్థితులు ఎదురైతే ఆమె కూడా శ్వేత మార్గాన్నే ఎన్నుకోవచ్చు. అప్పుడు తన మాటేమిటి? ఇలా విభిన్న కోణాల్లో ఆలోచిస్తున్న సత్యానికి పెళ్లి చేసుకోవాలనిపించలేదు. అందుకే ఏదో ఒక వంకతో పెళ్లిని వాయిదా వేస్తూ వచ్చాడు.

కాలానికి ఎవరి స్థితిగతులతోనూ ప్రమేయం లేదు. దాని పని అది చేసుకుపోతోంది. చూస్తుండగానే రోజులు, నెలలు, సంవత్సరాలు గడిచిపోతున్నాయి.

మావగారు ఎప్పటికి కూతుర్ని విడిచి ఉండలేరన్న సత్యాన్ని తెలుసుకున్న జనార్దన్ మరి భార్యను వచ్చేయమని వత్తిడి చేయుం మానేశాడు. అయితే అతడు ఉద్యోగస్తుడవడం వల్ల ఎక్కువ కాలం ఒంటరిగానే గడపవలసి వచ్చేది.

ఉన్నట్లుండి ఒకరోజు అర్ధరాత్రి మంగపతికి గుండెపోటు వచ్చింది. ఊళ్ళో సరియైన వైద్య సదుపాయంలేకపోవడంతో శ్వేతకు ఏంచేయాలో పాలుపోక నిస్సహాయంగా తండ్రి గుండెల మీద జండుబామ్ మర్దించ సాగింది. రాత్రికి రాత్రి ఎక్కడకు తీసుకెళ్ళాలన్నా ఆ ఊరికి రవాణా సౌకర్యం లేదు. ఆలస్యం చేసేకొద్దీ పరిస్థితి విషమించే ప్రమాదముందని గ్రహించిన సత్యం మోటారు బైక్ మీద పట్నం వెళ్ళి డాక్టర్ని తీసుకొచ్చాడు. అయితే వైద్యుడు వచ్చేలోపలే అతడి ప్రాణాలు అనంతవాయువుల్లో కలిసిపోయాయి.

భోరుమని విలపించింది శ్వేత.

సత్యం సంగతి సరేసరి.

మంగపతి మరణవార్త విన్న గ్రామస్థులు పరుగు పరుగున వచ్చారు.

తండ్రి గుండెల మీద పడి లబోదిబోమంటున్న శ్వేతని ఓదార్చడం అక్కడ ఏ ఒక్కరి వల్ల కావడం లేదు.

చెల్లాయిలా తను పైకి ఏడవలేక దుఃఖాన్ని లోలోపలే దిగమింగుకుంటున్నాడు సత్యం. కాస్సేపయ్యాక గుండె దిటవు చేసుకుని అయిన వాళ్ళందరికీ ఫోన్ చేశాడు. బంధువులు ఒక్కొక్కరూ రాసాగారు.

వర్తమానం అందుకుని జనార్ధన్ కూడా వచ్చాడు.

కర్మకాండలు పూర్తయ్యాయి.

వచ్చిన చుట్టాలు మూటాముళ్ళూ సర్దుకుంటున్నారు.

"అమ్మా. . . శ్వేతా! పెట్టె సర్దుకో. బావగారితో మాట్లాడాను. అందరితో పాటు రేపే నీ ప్రయాణం. నీకోసం ఇక్కడ మీ అన్నయ్య తప్ప ఇంకెవరూ లేరు. ఇప్పుడైనా అత్తవారింటికి బయలుదేరి కట్టుకున్న వాడిని సుఖ పెట్టమ్మా".

అన్నయ్య మాటలకు చలించిపోయింది శ్వేత.

ఆమె నోటి వెంట మాట రావడంలేదు.

'అలాగే' అన్నట్లు కళ్ళతోనే ఊకొట్టింది.

★ ★ ★

"అన్నయ్యా!" అని మురిపెంగా పిలిచింది శ్వేత

"ఏం కావాలో అడుగు తల్లీ" అన్నాడు సత్యం ఎంతో అనునయంగా.

"కాదనవుగా"

"ఊహుఁ. నువ్వు కోరుకుంటే నా ప్రాణాన్నైనా ఇస్తాను. సంశయించకుండా అడుగు" అన్నాడు సత్యం.

"నువ్వు వెంటనే పెళ్ళి చేసుకోవాలి. నేను వెళ్ళిపోతే నువ్వు ఒంటరివాడివైపోతావు. నిన్ను చూసేవాళ్ళెవరూ ఉండరు. నాకోసమైనా నువ్వు వదినను తెస్తావని ఒట్టెయ్యగలవా?"

ఆ మాటలు అంటున్నప్పుడు ఆమె కంఠంగద్గదమైంది.

"అలాగే తల్లీ. . . తప్పకుండా. మళ్ళీ నీ గుమ్మంలో అడుగుపెట్టేది పెళ్లి శుభలేఖతోనే. సరేనా?" శ్వేత చేతిలో చేయివేస్తూ కాంతులీనిన ఆమె కళ్ళలోకి లాలనగా చూసాడు సత్యం.

**(అక్టోబరు 2007 'పత్రిక' మంత్లీ)**